ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY 5 అనంతపురం జిల్లా వార్తలు
మంగళవారం 22 జూలై 2025



బిల్లుల కోసం

నిరీక్షణ..!

పేరుకుపోయిన 'పల్లెపండుగ' బకాయిలు
పలుచోట్ల అసంపూర్తిగా నిలిచిన పనులు
శింగనమల నియోజకవర్గంలో రూ.15 కోట్లు పెండింగ్
లబోదిబోమంటున్న తెలుగు తమ్ముళ్లు

6

జడ్పీలో కోల్డ్‌వార్..!

గాడితప్పుతున్న పాలన
ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓలు
శిక్షణకు వచ్చి కార్యదర్శ ఎన్నికల్లో నిమగ్నం

6

చేయి తడిపితేనే..!

బిల్లులు కావాలంటే తప్పదు

డిపాజిట్ సొమ్ము ఇవ్వాలన్నా అంతే..!
'నీరు-చెట్టు' కాంట్రాక్టర్లకు తప్పని తిప్పలు
పీక్కుతింటున్న మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు



ఇక్కడ కాలవ పక్కన వెంచర్ అనుమతికి రూ.లక్షల్లో ముడుపులు ముట్టజెప్పారు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పని ఏదైనా చేయి తడపందే చేసేది లేదని మైనర్ ఇరిగేషన్ శాఖలోని కొందరు ఇంజనీర్లు తెగేసి చెబుతున్నారు. పెండింగ్ బిల్లులు చేయాలన్నా, డిపాజిట్ సొమ్ము తిరిగి ఇచ్చేయాలన్నా 'మామూలే' అంటున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని ఏళ్ల తరబడి ఎదురుచూసిన కాంట్రాక్టర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. టీడీపీ హయాంలో, 2014-19 మధ్య కాలంలో పనిచేసిన నీరు-చెట్టు బిల్లులను వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక ఆ బిల్లులను చెల్లించేందుకు అంగీకరించింది. కానీ, 'దేవుడు వరమిచ్చినా..' అన్నట్లుగా తయారైంది కాంట్రాక్టర్ల పరిస్థితి. జిల్లాలో రూ.40 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉండగా, ఇప్పటి వరకు రూ.20 కోట్ల వరకు చెల్లించేశారు. మిగిలిన రూ.20 కోట్ల బిల్లులు, డిపాజిట్ మొత్తాన్ని పొందేందుకు బాధిత కాంట్రాక్టర్లు ఇంజనీర్లకు ముడుపులు ముట్టజెప్పాల్సి వస్తోంది. ఇటీవల ఓ కాంట్రాక్టర్, ఇంజనీర్ మధ్య బిల్లులు, డిపాజిట్ విషయంలో వాగ్వాదం జరగడం పరిస్థితికి అద్దం పడుతోంది. కాగా, వరద ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో వెంచర్లకు అనుమతి ఇస్తూ, కొందరు రూ.లక్షలు దండుకుంటున్నారు.

ఇంకా ఎదురుచూపులే..

టీడీపీ ప్రభుత్వంలో 2014-19 మధ్య కోట్లాది రూపాయల నీరు-చెట్టు పనులను చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లలో సుమారు రూ.300 కోట్ల పనులను కాంట్రాక్టర్లు చేశారు. వంకలు, వాగులలో పూడికతీత, ముళ్ల పొదల తొలగింపులు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం వంటి పనులు ఇందులో ఉన్నాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో కాంట్రాక్టర్లకు గడ్డుకాలం మొదలైంది. నీరు-చెట్టు బిల్లుల్లో రూ.150 కోట్ల వరకు బిల్లులు జిల్లాలో పెండింగ్‌లో పెట్టారు. దీంతో బాధితుల్లో కొందరు కోర్టును ఆశ్రయించి, బిలులు పొందారు. మరికొందరివి అలాగే ఉండిపోయాయి. 2024లో కూటమి అధికారంలోకి రావడంతో బాధితులు ప్రభుత్వాన్ని ఆశ్రయించారు. పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్ల బిల్లులను ఇవ్వాలని విన్నవించారు. ప్రభుత్వం అంగీకరించింది. కానీ, ఇంజనీర్లు 'సంతృప్తి' చెందితేగానీ ఆ సొమ్ము బాధిత కాంట్రాక్టర్లకు దక్కే పరిస్థితి లేకుండాపోయింది.

చేయి తడపాల్సిందేనా..?

కూడేరు మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ గతంలో నీరు-చెట్టు కింద సుమారు రూ.50 లక్షల పనులు (మిగతా 6వ పేజీలో...)

పేదల బియ్యంతో

వ్యాపారం

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

- కడప జిల్లా సరిహద్దు గ్రామంలో భారీగా నిల్వలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ బియ్యం (ఫైల్)

పుట్లూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదల బియ్యం పక్కదారి పడుతున్నాయి. పేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని కొందరు మాఫియాగా ఏర్పడి చౌకగా కాజేస్తున్నారు. మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ గ్రామంలో చౌకడిపో బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో రెండు నుంచి పదో తేదీ వరకు ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యాన్ని కొందరు కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నట్లు సమాచారం.

కడప జిల్లా సరిహద్దులో భారీగా నిల్వలు

మండలంలోని కడపజిల్లా సరిహద్దు గ్రామంలో రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. ప్రతినెలా సుమారు రెండుమూడు లారీల రేషన్ బియ్యాన్ని అక్కడే నిల్వ చేసి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు మండలాల నుంచి సేకరించిన బియ్యాన్ని ధర్మవరం, బెంగళూరు మరి కొన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రజల నుంచి కేజీ రూ.15చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు కిలో రూ.20 నుంచి రూ.25వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. గ్రామాల్లో ప్రజల నుంచి రాత్రివేళల్లో మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇలా గతంలో ఓ గ్రామంలో కొనుగోలు చేసి ఓ ఇంటివద్ద పెట్టడంతో అప్పట్లో పోలీసులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. కానీ ప్రస్తుతం అలాకాకుండా నేరుగా గ్రామాల్లో ఇంటింటికి వాహనంతో తిరుగుతూ కొనుగోలు చేస్తున్నారు. రేషన్‌బియ్యం విచ్చలవిడిగా కొందరు కొనుగోలు చేస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ తతంగం కొందరు అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మా ప్రభుత్వంలో అక్రమ అరెస్టుల్లేవ్

- రాష్ట్ర ప్రగతిని జీర్ణించుకోలేక వైసీపీ గగ్గోలు
- హోం మంత్రి అనిత
- హామీలన్నీ నెరవేరుస్తున్నాం: మంత్రి సవిత



మడకశిర బహిరంగ సభలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మడకశిరటౌన్/గుడిబండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వంలో అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు ఆస్కారం లేదని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. పట్టణంలోని జ్యోతిబాపూలే సర్కిల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు పాలనతో ప్రజలు ప్రశాంతంగా ఉన్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ప్రశ్నిస్తే అరెస్టు చేసేవారని, అవినీతిని ఎండగడితే అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపేవారన్నారు. ప్రస్తుతం అలాంటి వాటికి తావు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. ఏడాది పాలనలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. చంద్రబాబు ఎంతో అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తుంటే జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు, ఆపార్టీ అధినేత జగన్ గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. మారుమూల మడకశిరను సైతం పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.2700కోట్ల పెట్టుబడులతో డిఫెన్స్ పరిశ్రమ, సోలార్ పరిశ్రమల రాకతో నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి లభించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఉదయం విలేకరుల సమావేశంలో హోంమంత్రి మాట్లాడారు. తర్వాత ఇండియన్ డిజైన్ గార్మెంట్ పరిశ్రమను సందర్శించి, అక్కడ పనిచేస్తున్న మహిళలతో ముచ్చటించారు. తర్వాత గుడిబండలో (మిగతా 6వ పేజీలో...)

ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టు

ప్రాబబుల్స్‌లో ఐదుగురికి చోటు

7

ప్రజా సమస్యలపై అలసత్వం తగదు

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్


అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం తగదని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, ఇతర అధికారులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 612 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయిలో కూడా పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దరఖాస్తుదారుడికి తృప్తి కలిగేలా పరిష్కారం చూపించాలన్నారు. రీ సర్వేపనులను ఆయా గ్రామాల్లో వేగంగా పూర్తి చేయాలన్నారు.

డీఆర్ఓ మలోల మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీసు, విపత్తు నివారణ, విద్యుత్ తదితర శాఖ అధికారులు ఈ విషయంలో అవసరమైన మేరకు చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. క్లోరిన్, బ్లీచింగ్ స్ప్రే చేసి పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్

ఆచూకీ తెలపండి..!

కొన్ని నెలలుగా పత్తా లేకుండా పోయారు
కళ్యాణదుర్గం సీఐకి టీడీపీ కౌన్సిలర్ల ఫిర్యాదు



కళ్యాణదుర్గం టౌన్ సీఐ యువరాజుకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కళ్యాణదుర్గం, జూలై 21(ఆంధ్రజ్యోతి): కొన్ని నెలలుగా కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్ పత్తా లేకుండా పోయాడని, ఆయన ఆచూకీ తెలపాలని కౌన్సిలర్లు సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కళ్యాణదుర్గం టౌన్ సీఐ యువరాజుకు 11 మంది టీడీపీ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. వైసీపీ మద్దతుతో గెలిచిన మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కౌన్సిల్ సమావేశాలకు రాకుండా, అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ఎవరికీ కనిపించకుండా పోయాడని సీఐకి వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అది చూసి జీర్ణించుకోలేక ఇలా మున్సిపల్ చైర్మన్ అదృశ్యమై ఉండవచ్చునని తమకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాలేదని, ఎక్కడున్నాడో తెలియకపోవడంతో తాము ఆందోళన చెందుతున్నామని అన్నారు. రెండు రోజుల్లోగా మున్సిపల్ చైర్మన్ ఆచూకీని కనిపెట్టి కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని సీఐని కౌన్సిలర్లు వేడుకున్నారు.

ఘనంగా మస్తాన్ వలి గంధం



గంధం తీసుకువస్తున్న ముజావర్

6

దొంగల ముఠా అరెస్ట్

రూ.19 లక్షల వాహనాలు స్వాధీనం
ఏడుగురు సభ్యుల్లో నలుగురు మైనర్లు
జువైనల్ కోర్టుకు నిందితులు

7

తొలగని సందిగ్ధత

గ్రేడ్-1 వీఆర్‌ఓల బదిలీలకు అంతరాయం

చేసినందుకు ఓ సారి..

చేయకపోయినా మరో సారి

- ఒకే పనికి రెండు బిల్లులు
- దొంగ బిల్లులతో నిధులు డ్రా
- యాడికి గ్రామ పంచాయతీలో దోపిడీ

యాడికి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాడికి గ్రామ పంచాయతీలో ఒకే పనికి రెండు సార్లు బిల్లులు మంజూరు చేయించుకుని ప్రజాధనాన్ని దోచేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీ పరిధిలో తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్న ఒక గ్రామానికి పైప్‌లైన్ వేశారు. ఇందుకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ ఏడాది మే 20న రూ.3,04,556 బిల్లులు మంజూరు చేశారు. అదే నెల 31న దొంగ బిల్లులు సృష్టించి, రూ.3,04,556 బిల్లును మరో వ్యక్తికి మంజూరు చేశారు. జూన్ నెలలో మేజర్ పనులు చేపట్టినట్లు రూ.1.6లక్షలు బిల్లు మంజూరు చేశారు. వారం రోజుల వ్యవధిలో అవే పనులు చేసినట్లు రూ.1.6లక్షలు బిల్లుపెట్టి మంజూరు చేయించుకున్నారు. యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక పని చేస్తే దానికి బిల్లు మంజూరు చేయడం, వారంపదిరోజుల వ్యవధిలో అంతే మొత్తంలో మరో నకిలీ బిల్లు సృష్టించి, నిధులు మంజూరు చేయించుకోవడం సర్వసాధారణంగా మారింది. చేసిన పనులకు, చేయని పనులకు కూడా యాడికి గ్రామ పంచాయతీలో బిల్లులు మంజూరు చేసి ప్రజాధనాన్ని కొందరికి దోచి పెడుతున్నారని తీవ్ర విమర్శలు కొందరు అధికారులపై వ్యక్తం అవుతున్నాయి. ఇలా పదుల సంఖ్యలో నకిలీ బిల్లులు సృష్టించి ఒక నాయకుడు, ప్రజాప్రతినిధి ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని, దీనికి అధికారులు కూడా వంతపాడటం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జరుగుతున్న అక్రమాలపై విచారణ కమిటీ వేసి, నిజాలు నిగ్గు తేల్చి, ప్రజాధనాన్ని కాపాడలనే డిమాండ్ స్థానికుల నుంచి వ్యక్తం అవుతోంది.



యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయితీ

గతంలో యథేచ్ఛగా దొంగ బిల్లులు మంజూరు చేయించుకున్నవారు ప్రస్తుతం యాడికి గ్రామపంచాయతీ కార్యదర్శి (ఇన్‌చార్జ్)గా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శశికళపై సైతం ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీనిపై యాడికి ఎంపీడీఓ కార్యాలయంలోనే పంచాయితీ చేసినట్లు సమాచారం. అయితే డిప్యూటీ ఎంపీడీఓ దొంగ బిల్లులు చేయడానికి ససేమిరా అన్నట్లు తెలిసింది. ప్రతి పనికి రికార్డు ఉండాల్సిందేనని, వాటి ఆధారంగానే బిల్లులు చేస్తానని ఖరాఖండిగా చెప్పినట్లు సమాచారం. దొంగబిల్లులు చేసుకున్నట్లు యాడికి అంతా తెలిసిపోయిందని, దీనిపై ఫిర్యాదులు వెళ్లి విచారణ కమిటీ వస్తే తమ పరిస్థితి ఏమిటన్న ఆలోచనలో ప్రజాధనం దోచేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



Scheme Name/XV Finance Commission-XVFC
State Name/ANDHRA PRADESH
District Anantapur
Block Name/Yadiki
Local VILLAGE/YADIKI
From - To 2025-05-01 - 2025-06-01

S.No.	Voucher No/Voucher Date	Amount (in Rupees)	Vendor	Post Office
1	XVFC/2025/20/05/2025	29117.00	SHAIK SHABUDDIN—Citizen	Credited
2	XVFC/2025/20/05/2025	[illegible]	SHAIK SHABUDDIN—Citizen	Credited
3	[illegible]	304556.00	VALLANI SUPPANNA[illegible]—Citizen	Credited
4	XVFC/2025/20/05/2025	48960.00	TAJ LIGHT HOUSE—Citizen	Credited
5	XVFC/2025/20/05/2025	47500.00	PANDU SRIRAMULU—Citizen	Credited
6	XVFC/2025/20/05/2025	52490.00	GORTHI RUDRAMA NAIDU—Citizen	Credited
7	[illegible]	[illegible]	GORTHI RUDRAMA NAIDU—Citizen	Credited
8	[illegible]	17500.00	GORTHI RUDRAMA NAIDU—Citizen	Credited
9	XVFC/2025/31/05/[illegible]	304556.00	[illegible]ARA HEMANTH—Citizen	Credited
10	[illegible]	[illegible]	KAMMARA HEMANTH—Citizen	Credited
11	[illegible]	[illegible]	TAJ LIGHT HOUSE—Citizen	Credited
12	[illegible]	160000.00	[illegible]ANNA—Citizen	Credited
13	[illegible]	18000.00	M PARVATHI—Citizen	Credited
14	[illegible]	18000.00	[illegible]—Citizen	Credited
15	[illegible]	6000.00	E SUSHEELAMMA—Citizen	Credited
16	[illegible]	24000.00	BURAKALA LAKSHMIDEVI—Citizen	Credited
17	[illegible]	18000.00	M PARVATHI—Citizen	Credited
18	[illegible]	160000.00	[illegible]ARA HEMANTH—Citizen	Credited
19	[illegible]	31500.00	Happy Home—Citizen	Credited

మేనెలలో యాడికి గ్రామపంచాయతీలో చేసిన పనులకు, చేయని పనులకు సైతం వేర్వేరు పేర్లతో బిల్లులు డ్రాచేసిన వైనం

విచారించి చర్యలు తీసుకుంటాం



యాడికి గ్రామ పంచాయతీలో దొంగ బిల్లులు పెట్టి బిల్లులు మంజూరు చేసుకున్న విషయం మా దృష్టికి రాలేదు. పనులు చేస్తేనే బిల్లులు చేయాలి. పనులు చేయకపోయినా బిల్లులు చెల్లించకూడదు. దీనిపై ఎవరైనా ఫిర్యాదుచేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

\- వీరరాజు, ఎంపీడీఓ

తమ్ముళ్లూ.. ఏమిటిది..?

ఉపాధి పథకంలో చొరబాటు..
పనులకు వెళ్లకుండా బిల్లులు స్వాహా
కూలి పనులు చేసినట్లు దొంగ మస్టర్లు

పుట్టపర్తి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పథకం పక్కదారి పడుతూనే ఉంది. వైసీపీ హయాం లో అవినీతి పరాకాష్ఠకు చేరగా, కొందరు తెలుగు తమ్ముళ్లు దాన్ని కొనసాగిస్తున్నారు. కొందరు అధికారులను అవినీతిలో భాగం చేస్తున్నారు. అడ్డుకోవాలని చూసే అధికారులను బదిలీ చేయించేందుకు ఏమాత్రం వెనకాడటం లేదు. వీరి చర్యలు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అవినీతికి అలవాటు పడిన ఉద్యోగులు, అధికారుల తీరులో మార్పు కనిపించలేదు. జిల్లాలో దొంగ మస్టర్ల దందా కొనసాగుతూనే ఉంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉద్యోగులు కుమ్మక్కై.. ఉపాధి కూలీల పేరిట దొంగ మస్టర్లను సృష్టించి నిధులను స్వాహా చేస్తున్నారు. చేయని పనులకు రికార్డులు సృష్టించి, అందినకాడికి బిల్లులు చేసుకుని దండుకుంటున్నారు. అవినీతి సొమ్మును గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, అధికారులు వాటాలు వేసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లాలో అడపాదడప ఆకస్మిక తనిఖీలు, విజిలెన్సు దాడులు జరుగుతున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ఉపాధి పనుల్లో అవినీతిని నిర్మూలిస్తున్నామని అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో ప్రతిఫలించడం లేదు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

స్థాయి మరిచి..

జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ ఉపాధి పనుకు వెళ్లొచ్చు. అడిగినవారందరికీ పనులు కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. ఇదే అదనుగా కొందరు పనులకు వెళ్లకుండానే వెళ్లినట్లు దొంగ మస్టర్లను సృష్టించి, బిల్లులు పెట్టుకుంటున్నారు. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న వారిలో జిల్లాలోని కొందరు టీడీపీ మండల కన్వీనర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రేషన్ డీలర్లు, కార్పొరేట్ కళాశాల ఉద్యోగులు, ద్వితీయ శ్రేణి నాయకులు.. చివరకు కొందరు న్యాయవాదులు కూడా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. వీరి తీరును చూసి పనులకు వెళ్లి రెక్కలు ముక్కలు చేసుకునే ఉపాధి కూలీలే అవాక్కవుతున్నారు. హోదా, స్థాయిని మరిచి పేదల పథకాన్ని దుర్వినియోగం చేయడం ఏమిటని మండిపడుతున్నారు.

హవ్వ.. మండల కన్వీనర్లు..!

జిల్లాలో ఆధ్యాత్మికంగా పేరున్న ఓ ప్రధాన ప్రాంతంలోని రూరల్ మండలానికి ఆయన టీడీపీ కన్వీనర్. ఉపాధి పనులకు వెళ్లకపోయినా వెళ్లినట్లు మస్టర్లు రాయించి రూ.వేలల్లో బిల్లులు చేసుకున్నారు. ఇదే ప్రాంతానికి దగ్గరగా ఉన్న మరో మండల కన్వీనర్, ఆయన భార్య (మాజీ సర్పంచ్) కూడా ఉపాధి పనులకు వెళ్లకుండానే వెళ్లినట్లు దొంగ మస్టర్లు సృష్టించి వేలాది రూపాయలను కాజేశారు.

- పుట్టపర్తి మండలం పైపల్లి గ్రామానికి చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఒకరు, ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన న్యాయవాది (మిగతా 6లో..)

బిల్లుల కోసం నిరీక్షణ..!

పేరుకుపోయిన 'పల్లెపండుగ' బకాయిలు

పలుచోట్ల అసంపూర్తిగా నిలిచిన పనులు

శింగనమల నియోజకవర్గంలో రూ.15 కోట్లు పెండింగ్

లబోదిబోమంటున్న తెలుగు తమ్ముళ్లు

బుక్కరాయసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఒక ప్పుడు సీసీ రోడ్ల పనులంటే కిందిస్థాయి నాయకులు, కాంట్రాక్టర్లు, కార్యకర్తలు ఎగబడేవారు. ఏ ప్రభుత్వం ఉంటే.. ఆ పార్టీ నాయకుల్లో తీవ్ర పోటీ ఉండేది. సంబం ధిత ప్రజాప్రతినిధులకు 10 శాతం పర్సెంటేజీ ఇచ్చి మరీ పనులు దక్కించుకునేవారు. అదే పనులకు ఇప్పుడు నాయకులు, కాంట్రాక్టర్లు ముందుకు రాలేని పరిస్థితి నెల కొంది. సకాలంలో పనులు పూర్తిచేసి రికార్డు చేయిం చినా... బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక ఎదురు చూడాల్సి వస్తోంది. పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గానికి రూ.17 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అభివృద్ధి పనులు మంజూరు చేసింది. శింగనమల నియోజకవర్గా నికి రూ.16.47 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం వచ్చిన జోష్‌లో టీడీపీ కార్యకర్తలు సీసీ రోడ్లు పనులు చేయడానికి పోటీ పడ్డారు. వెంటనే బిల్లులు వస్తాయన్న ఆశతో చకచకా పూర్తి చేశారు. కానీ బిల్లులు అందకపోవడంతో నిరుత్సాహ పడ్డారు. ఆరు మండ లాల్లో 75 శాతం పనులు పూర్తి చేసి ఎనిమిది నెలల యింది. అప్పులు చేసి మరీ కాంట్రాక్టర్లు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియక నాయకులు, కాంట్రాక్టర్లు లబోదిబో మంటున్నారు.

అరకొరే విడుదల

గత ఏడాది అక్టోబరు 14 నుంచి పల్లెపండగ పేరిట గ్రామ సభలు నిర్వహించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు వినతులు స్వీకరించారు. జనవరి, ఫిబ్రవరిలో పూర్తయిన పనుల బిల్లులను తొలిదశలోనే అధికా రులు అప్‌లోడ్ చేశారు. నాలుగైదు నెలలు దాటినా కాంట్రాక్టర్లకు తొలి దశ నిధులు విడుదల కాలేదు. కొన్ని చోట్ల పనులు చేసేందుకు నియోజకవర్గంలో ముందుకు రాలేదు. ఇప్పటి వరకు బుక్కరాయసముద్రం మండ లంలో రూ.30లక్షలు, గార్లదిన్నెలో రూ.20.50 లక్షలు, నార్పలలో రూ.66.50 లక్షలు, పుట్లూరులో రూ.61 లక్షలు, శింగనమలలో రూ.14 లక్షలు, యల్లనూరు మండలంలో రూ. 26 లక్షలు నిధులు అలాగే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల మందకొడిగా సాగుతున్నాయి. 2014-19 మధ్య



బుక్కరాయసముద్రం మండలంలో వేసిన సీసీ రోడ్డు (ఫైల్)

చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే బిల్లులు కోసం నిరీక్షణ చేయక తప్పలేదని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెపండుగ కింద ఆరు మండలాలకు 338 పనులుకు సంబం ధించి రూ. 16కోట్ల 47లక్షల 50వేలు మంజూరయ్యాయి. ఇందులో రూ.కోటి మాత్రమే నిధులు విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఇంకా రూ.15 కోట్ల పైగా కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సింది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

పల్లెపండుగ కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నియోజకవర్గంలో నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం. రెండో విడత కింద పల్లె పండుగకు మరో రూ.16 కోట్ల నిధులు నియోజక వర్గానికి మంజూరు కానున్నాయి.

– కృష్ణజ్యోతి, డీఈ, పంచాయతీరాజ్ శాఖ

పరీక్షలను ఏకరీతిలో నిర్వహించాలి: డీఈఓ

అనంతపురం విద్య, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ప్రైవేట్ పాఠశాలలోను ఏకరీతిలో పరీక్షలు నిర్వహించాలని డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీఈబీ సమావేశ మందిరంలో ప్రైవేట్ స్కూల్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అనేక విద్యాసంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రం ఎంపికలోకూడా ఈసారి మార్పులు తీసుకు వచ్చిందని వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇక నుంచి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో ఒకే రీతిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏసీ గోవిందనాయక్, ఏడీ మునీర్, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసులు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్స్ సంఘాల నాయకులు కుసుమా పుల్లారెడ్డి, నాయుడు, రాఘవేంద్ర, నాగరాజు, బెటుగుప్ప శ్రీనివాసులు, రవిచంద్రారెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామచంద్ర, భాస్కరరెడ్డి, రఫీ పాల్గొన్నారు.



గుడిబండలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు వంగలపూడి అనిత, సవిత

మా ప్రభుత్వంలో అక్రమ అరెస్టుల్లేవ్

(5వ పేజీ తరువాయి)

నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం మడకశిర పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రత్నతో కలిసి తనిఖీ చేశారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట: మంత్రి సవిత



ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసి నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్ , ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అధికారంలోకి రాగానే రూ.3వేల నుంచి రూ.4వేలకు పింఛను పెంచామన్నారు. తల్లికి వందనం అందించామ న్నారు. త్వరలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పి స్తామన్నారు. ఇలా అన్నీ హామీలు నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలో గజదొంగలు ఇంకా ఉన్నారని, వారిని త్వరలో పట్టుకొని, చట్టప్రకారంగా శిక్షిస్తామన్నారు. వైసీపీ శవ , చిల్లర రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేశాము కనుకే ప్రస్తుతం ప్రజల వద్దకు రాగల్గుతున్నట్లు వెల్లడించారు. వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి తప్ప అభివృద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు.

అభివృద్ధిలో తేడా చూపిస్తాం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగా మిగా నిలపడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు పేర్కొన్నారు. 2024కు ముందు తరువాత అన్న విధంగా అభివృద్ధి చేసి చూపుతామన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు సారథ్యంలో అవినీతికి ఆస్కారం లేకుండా ముందుకు సాగు తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గుండుమల పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు త్వరలో పట్టు మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. హంద్రీనీవా సమాంత కాలువ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయని, త్వరలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కాలువలపై పర్యటన చేయనున్నట్లు తెలిపారు.

ఇచ్చిన మాట నిలుపుకున్న ప్రభుత్వం

● గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకుం దని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పరిశ్రమల ఏర్పాటు తోనే యువతకు భవిషత్తు అని నమ్మిన చంద్రబాబు అందుకు అను గుణంగా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నా రని పేర్కొ న్నారు. గత పాలకులు చేసిన అవినీతి, అక్రమా లను బయటపెడుతుంటే తట్టుకోలేక ఎదురుదా డికి దిగుతున్నారన్నారు. వైసీపీకి భవిషత్తు లేదని, అనేక మంది నాయ కులు, ఆపార్టీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, సింగల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

అహిర్ రెజిమెంట్ సాధనే లక్ష్యం

● అఖిల భారత యాదవ మహాసభ నాయకుడు శేషపాణి యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న శేషపాణి యాదవ్

అనంతపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ సాధనే తమ లక్ష్యమని అఖిల భారత యాదవ మహాసభ సీనియర్ నాయకుడు శేషపాణి యాదవ్ అన్నారు. లక్ష్య సాధన కోసం అఖిల భారత యాదవ మహాసభ సూచనలతో జూన్ 13న బిహార్‌లో రాజ్ కలశయాత్రను ప్రారంభించామని తెలిపారు. ఈ యాత్ర సోమవారం అనంతపురం జిల్లా కేంద్రానికి చేరుకుంది. తపో వనం సర్కిల్‌లో జిల్లా యాదవ సంఘం నాయకులు స్వాగతం పలి కారు. అక్కడి నుంచి రామ్‌నగర్‌లోని నక్కా రామారావు యాదవ భవ న్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడి ముందు కలశాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. యాత్ర పర్యవేక్ష కుడు, అఖిల భారత యాదవ మహాసభ సీనియర్ నాయకుడు శేష పాణి యాదవ్ మీడియాతో మాట్లాడారు. 1962లో భారత భూభాగాన్ని దురాక్రమించేందుకు చైనా సైనికులు 5 వేల మంది వచ్చారని, వారిని 150 మంది యాదవ సైనికులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఆ పోరా టంలో 113 మంది చైనా సైనికులను మట్టుబెట్టిన యాదవ సైనికు లలో 114 మంది అమరులయ్యారని అన్నారు. ఇటీవల జరిగిన ఆపరే షన్ సిందూర్‌లో సచిన్ యాదవ్ వీరమరణం పొందారని, దేశ రక్షణ కోసం యాదవ సోదరులు వారసత్వాన్ని కొనసాగించాలనే సంకల్పంతో ఉన్నారని అన్నారు. భారత సైన్యంలో అన్ని కులాల పేరుతో రెజిమెం ట్‌లు ఉన్నాయని, ఒక్క యాదవులకు మాత్రమే రెజిమెంట్ లేకపో వడం శోచనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యాదవులందరినీ కలుపుకుని నవంబరు 18న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అహిర్ రెజిమెంట్ సాధనకోసం పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. కార్య క్రమంలో అఖిల భారత యాదవ సంఘం మహిళా విభాగం అధ్యక్షు రాలు మహేశ్వరి యాదవ్, యాదవ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.13తో, సరాసరి ధర రూ.23తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2100టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 936 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ ఇన్‌చార్జ్ డీడీగా కుష్బూ కొఠారి

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలను బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారికి అప్పగించారు. నాలుగు నెలల క్రితం ఇక్కడ పనిచేస్తున్న డీడీ ప్రతాప్‌సూర్యనారాయణరెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. దీంతో ఈ శాఖలో ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది. ఇంతవరకు డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు ఎస్సీ వెల్ఫేర్‌కు ఇన్‌చార్జ్ డీడీగా కొనసాగుతూ వచ్చారు. ఇపుడు ఆయన బదిలీ కావడంతో ఎస్సీ వెల్ఫేర్‌శాఖ ఇన్‌చార్జ్ డీడీ బాధ్యతలను బీసీ వెల్ఫేర్‌శాఖ డీడీ కుష్బూ కొఠారికి అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

బాధ్యతలు చేపట్టిన డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావు

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారిగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనను నెల రోజుల క్రితం అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఇక్కడికి డీటీడబ్ల్యూఓగా ప్రభుత్వం నియమించింది. ఉత్తర్వులు వచ్చి నెల రోజులైనా రాకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం జిల్లాకు చేరుకున్నారు. తొలుత ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీటీడబ్ల్యూఓ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ సురేష్‌తో పాటు ఇతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

● **రామాంజనేయులు రిలీవ్**

ఇప్పటి వరకు ఇక్కడ డీటీడబ్ల్యూఓగా ఉన్న రామాంజనేయులు రిలీవ్ అయ్యారు. కొత్త డీడీగా శ్రీనివాసరావు రావడంతో ఆయనకు చార్జ్ ఇచ్చి రిలీవ్ తీసుకున్నారు. రామాంజనేయులు పంచాయతీరాజ్‌శాఖకు చెందినవారు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

ఘనంగా మస్తాన్ వలి గంధం

గుంతకల్లు టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని పాతగుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 390 ఉరుసు ఉత్సవాల సందర్భంగా సోమవారం ఘనంగా గంధం సమర్పించారు. పాత గుంతకల్లులో నివాసం ఉంటున్న గజాచారి నాగభూ షణంరెడ్డి ఇంటి నుంచి వేకువజామున స్వామి వారి గంధాన్ని తీసుకుని దర్గాకు చేరుకున్నారు. పాతగుంత కల్లు శివాలయంలో ఉన్న బావిలో నీటిని బిందెలతో తీసుకుని అశ్వం పాదాలకు పోసి మొక్కులు తీర్చుకు న్నారు. ముజావర్లు స్వామి పేరట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్గా ఆవరణం, పాతగుంతకల్లు రోడ్డు భక్తులతో కిక్కిరి సింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి చాదర్, చక్కెర, లడ్డు, టెంకాయలను సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వక్ఫ్ బోర్డు ఆధ్వ ర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గంధాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు బండారు రామన్నచౌ దరి, బండారు ఆనంద్ దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీని వాస్, సీఐ ఏపీ మస్తాన్, ఎస్‌ఐలు టీపీ వెంకట స్వామి, రామవేంద్రప్ప ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్, తదితరులు పాల్గొన్నారు.





గంధం తీసుకువస్తున్న భక్తులు, స్వామికి గంధం సమర్పిస్తున్న ముజావర్లు

తమ్ముళ్లూ.. ఏమిటిది..?

(5వ పేజీ తరువాయి)

కూడా ఉపాధి కూలీల అవతారమెత్తారు. పను లకు వెళ్లకుండా సొమ్ము కాజేశారు.

● బుక్కపట్నం మండలం కొండాపురం గ్రామా నికి చెందిన ఓ మహిళ అనంతపురం నగరం లోని ఓ కార్పొరేట్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. తన భర్తతో కలిసి ఐదేళ్ల నుంచి కరువు పనులకు వెళ్లినట్లు మస్టర్లు సృష్టించి సుమారు రూ.లక్ష తీసుకున్నారు.

● బుక్కపట్నం మండలంలో ఓ గ్రామానికి చెందిన మాజీ డీలరు, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఉపాధి కూలీల ముసుగులో భారీగా సొమ్ము కాజేశారు. క్రిష్ణాపురం గ్రామా నికి చెందిన ఓ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కూడా కూలీల అవతారమెత్తి అందినకాడికి దోచుకు న్నారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఇలాంటి అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతు న్నాయి.

వారే కీలకం..

ఉపాధి పథకం అమలులో ఫీల్డ్, టెక్నికల్ అసి స్టెంట్లు క్షేత్రస్థాయిలో ముఖ్య పాత్ర పోషిస్తారు. ఇదే అదనుగా వీరిలో కొందరు దొంగ మస్టర్లతో రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ఏ పార్టీ అధికా రంలో ఉంటే ఆ పార్టీ నాయకులను తమ స్వార్థం కోసం వాడుకుంటున్నారు. పేదలకు దక్కాల్సిన ఫలాలను పక్కదారి పట్టిస్తున్నారు. పుట్టపర్తి మండలంలో ఓ టీడీపీ నాయకుడికి మేలు చేయడానికి ఓ టెక్నికల్ అసిస్టెంట్ ప్రత్యే కంగా పనిచేస్తున్నాడు. వైసీపీ హయాం నుంచి జిల్లా కేంద్రం చుట్టు పక్కల మండలాల్లోనే విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం బుక్క పట్నం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఈ టెక్నికల్ అసిస్టెంట్ భారీగా అక్రమాలకు పాల్ప డినా, అధికార పార్టీ నాయకుల అండతో నెట్టుకొ స్తున్నాడు. నాయకులను ప్రసన్నం చేసుకునేం దుకు కొందరు టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు వారు చెప్పిన పనులకు దొంగ మస్టర్లను రాసి, బిల్లులు చేయిస్తున్నారు.

మాట వింటే సరి..

ఉపాధి పథకంలో తమ అవినీతి అక్రమాలకు సహకరించని అధికారులను కొందరు అధికార పార్టీ నాయకులు బదిలీ చేయిస్తున్నారు. చెన్నేకొ త్తపల్లి మండలంలో తమకు అనుకూలంగా మామిడిచెట్ల బిల్లులను చేయలేదని ఓ మండల స్థాయి అధికారిని బదిలీ చేయించారు. పుట్టపర్తి మండలంలో అధికార పార్టీ నాయకులకు అండగా నిలిచిన ఓ మహిళా అధికారి సస్పెండ్ అయినా, తిరిగి విధుల్లో కొనసాగేలా చక్రం తిప్పారు.

మామూళ్ల మత్తు

ఉపాధి పథకంలో అవినీతిని అరికట్టాల్సిన అధి కారుల్లో కొందరు మామూళ్ల మత్తులో జోగుతు న్నారు. ప్రతి పంచాయతీ నుంచి వారానికి రూ.10 వేలు చొప్పున జిల్లా అధికారులకు కొందరు మామూళ్లు పంపుతున్నట్లు సమా చారం. దీంతో ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లపై అవి నీతి ఆరోపణలు వచ్చినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రచారం జరు గుతోంది.

ప్రభుత్వానికి చెడ్డపేరు

ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి పథ కాన్ని దుర్వినియోగం చేస్తున్న కొందరు నాయ కుల కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోం దని కార్యకర్తలు వాపోతున్నారు. పేదరికంలో ఉన్న తామే కూలి పనులకు వెళ్లి బిల్లులు పెట్టు కుంటున్నామని, కానీ సంపన్నులైన నాయకులు పనులకు రాకుండానే వచ్చినట్లు దొంగ మస్టర్లు రాయిస్తున్నారని అంటున్నారు. కష్టపడుతున్న తమకంటే.. దొంగ మస్టర్లు రాయించుకునేవారే ఎక్కువగా సంపాదిస్తున్నారని అంటున్నారు.

తనిఖీ చేస్తున్నాం..



ఉపాధి పథకంలో అవినీతి, అక్రమాలను ఉపే క్షించం. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసు కుంటాం. ఇప్పటికే ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో తనిఖీలు చేస్తున్నాం. విచార ణలో అవినీతికి పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసు కుంటాం.

– విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ



జిల్లా డ్వామా కార్యాలయం

జడ్పీలో కోల్డ్‌వార్..!

గాడితప్పుతున్న పాలన

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఎంపీడీఓలు

శిక్షణకు వచ్చి కార్యవర్గ ఎన్నికల్లో నిమగ్నం

చోద్యం చూస్తున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యా లయంలోని ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందన్న చర్చ సాగుతోంది. సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మధ్య వివాదం ముదిరినట్లు జడ్పీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కడప జిల్లాలో డీఎల్‌డీఓగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య డిప్యూటీ సీఈఓగా వచ్చారు. సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని కొన్ని నెలల క్రితం ఉన్నపలంగా బదిలీ చేయడంతో వెంకటసుబ్బయ్య కొన్నా ళ్లపాటు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తరువాత శివశంకర్‌ను సీఈఓగా నియమించినా, వెంకటసుబ్బయ్య అన్నీ తానై వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇన్‌చార్జి సీఈఓగా పనిచేసిన సమయంలో కొంత మంది ఎంపీడీఓలను కోటరీగా చేసుకుని, అంతా తానై వ్యవహరిస్తు న్నారన్న చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో సీఈఓను నియమించినా.. ఉన్నతాధికారి చేయాల్సిన పనుల్లో కూడా జోక్యం చేసుకుంటూ.. ఆయ నను డమ్మీ చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా.. ఉన్నతా



ధికారుల మధ్య కోల్డ్‌వార్‌తో పాలన గాడితప్పుతోందన్న ప్రచారం జరు గుతోంది. వీరి వ్యవహారం తెలుసుకున్న కొంతమంది కింది స్థాయి సిబ్బంది కోటరీలుగా మారి ఎవరికి చెప్పాల్సినవి వారికి చెబుతూ.. పనులు చక్కదిద్దుకుంటున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే తర హాలోనే వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారన్న చర్చ సాగుతోంది.

శిక్షణకు వచ్చి.. ఎన్నికల్లో నిమగ్నం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పంచాయతీ పురో గతి సూచిక 2.0లో భాగంగా మొదట సంబంధిత సిబ్బందికి పూర్తిస్థా యిలో శిక్షణ ఇచ్చి అందుకు అనుగుణంగా ఆ అధికారుల ద్వారా మండల, గ్రామస్థాయిలో అమలు చేసేలా తగిన చర్యలు చేపడుతున్నారు. అలాం టిది శిక్షణకు వచ్చిన ఎంపీడీఓలు మంగళవారం దానిని గాలికొదిలి, కార్య వర్గ ఎన్నికలో నిమగ్నమయ్యారు. ఇదంతా ఉన్నతాధికారుల ముందే జరు గుతున్నా.. పట్టనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

చేయి తడిపితేనే..!



మైనర్ ఇరిగేషన్ కార్యాలయం

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందుకు గాను రూ.12.5 లక్షలు కాషన్ డిపాజిట్‌గా చేశారు. దీనికితోడు పనుల కోసం అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి ఖర్చు చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో ఐదేళ్ల పాటు బిల్లులు ఆగిపోయాయి. వడ్డీ కట్టుకోలేక పొలాన్ని అమ్మేసి అప్పు తీర్చారు. రూ.23 లక్షల వరకు పెండింగ్ బిల్లులు, రూ.12.5 లక్షల డిపాజిట్ కోసం ఏడాదిగా ఇంజనీరు చుట్టూ తిరుగుతున్నా పనికాలేదు. కాకమ్మ కథలు చెబుతూ కాలయా పన చేశారు. దీంతో విసిగిపోయిన బాధిత కాంట్రాక్టర్, ఇటీవల మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో సదరు ఇంజనీరుతో వాగ్వాదానికి దిగారు. ఆ శాఖ ఉన్నతాధికారి జోక్యం చేసుకుని, నచ్చజెప్పారు. ఇది మచ్చుకు ఓ సంఘటన మాత్రమే. ఇలాంటివి ఆ శాఖలో కోకొల్లుగా జరుగుతు న్నాయి.

వెంచర్ల అనుమతికి..

కూడేరు మండలం గొట్కూరు వద్ద వెంచర్ వేయడానికి అనుమతి కోసం రూ.3 లక్షల వరకు ముడుపులు పుచ్చుకున్నట్లు సమాచారం. అదే ప్రాంతలో తాజా మరో వెంచరు వేయడానికి, పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువ ప్రభావం లేదని చూపడానికి భారీగా వసూలు చేసినట్లు తెలి సింది. కమ్మూరు నుంచి వచ్చే వర్షపు నీరు, వరద నీరు అగ్రిగోల్డ్ వెంచర్ మీదుగా నరసనాయునికుంట సమీపంలోని పెద్ద వాగులోకి వెళుతుంది. ఆ వాగుతో వెంచర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని అను మతి తీసుకోవడానికి మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లకు వెంచర్ యజమా నులు భారీగా ముడుపులు ముట్టజెప్పినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలవలు, వాగులు, వంకలలో వెంచర్లు వేయడానికి మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు కొందరు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు..



మైనర్ ఇరిగేషన్‌లో గతంలో నీరు-చెట్టు కింద పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. ఉన్నతాధికా రుల సూచనల మేరకు మంజూరైన బిల్లులను చెల్లిస్తున్నాం. ఇటీవల ఓ కాంట్రాక్టర్, ఇంజనీరు మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరికీ సర్దిచెప్పిన మాట వాస్తవమే. ఇతరత్రా ఒత్తిళ్లు, అదనంగా డబ్బులు అడిగినట్లు బాధితులు లిఖితపూర్వ కంగా ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకా డబోం. గతంలో చేసిన నీరు-చెట్టు బిల్లులను కోర్టు లేదా ఉన్నతాధికా రుల ఆదేశాల మేరకు మంజూరు చేసిన వెంటనే చెల్లించాలని సూచించాం. వరద ప్రభావం ఉండే ప్రాంతాలలో వెంచర్లు, నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు.

– విశ్వనాథ్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

యువకుడి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



కుళ్లాయప్ప (ఫైల్)

బుక్కరాయసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద రెండు ద్విచక్రవాహనదారులు ఢీ కొనడంతో బండారు కుళ్లాయప్ప (23) అనే యువకుడు మృతి చెందగా పవన్ అనే మరో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. పోలీసులు తెలిపిన మేరకు.. మండల పరిధిలోని రేకలకుంట గ్రామానికి చెందిన బండారు నల్లప్ప కుమారుడు కుళ్లాయప్ప ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు భవనంలో పని చేసేందుకు సోమవారం ఉదయం బయలుదేరాడు. అదే సమయంలోనే బుక్కరాయసముద్రం వైపు నుంచి గాంధీనగర్‌కు చెందిన బుల్లే పవన్ వస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనంతపురం సర్వజన అసుపత్రికి తరలించారు. నార్పల మండలం నుంచి నైట్ డ్యూటీ ముగించుకుని అటు వైపు నుంచి వస్తున్న ఎస్ఐ సాగర్ తన కారులోనే గాయపడిన ఇద్దరిని అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బండారు కుళ్లాయప్ప మృతి చెందగా.. బుల్లే పవన్‌కు మార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



గంగాధరప్ప (ఫైల్)

పరిగి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధనాపురం క్రాస్‌వద్ద శిర-కొడికొండ హైవేలో డివైడర్‌ను ఢీకొని గంగాధరప్ప(41) అనే వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి మండలం వడ్డిపల్లికి చెందిన గంగాధరప్ప ఆదివారం పావగడ తాలూకా పి.అచ్చంపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్లి తిరుగు ప్రయాణంలో ధనాపురం క్రాస్‌వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. భార్య సునందమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అధికారుల సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురం డీపీఓ నాగరాజునాయుడుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన పరుష వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నత ఉద్యోగి అయిన డీపీఓ పట్ల అనుచితగా ప్రవర్తించడం ఆయన స్థాయికి తగదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తుంటారని అన్నారు. వారిని కించపరిచేలా మాట్లాడడం తగదన్నారు. జేసీ వ్యాఖ్యలు ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారుల సంఘాల నాయకులు నరేష్‌కృష్ణ, నసీమా, నటరాజ్, రఘునాథ్‌గుప్త, నాగేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఇందిరబాల, గోపాల్‌రెడ్డి, శ్రావణ్, ఓంప్రకాష్, గోపీనాథ్, రమణప్ప, మహేంద్ర తదితరులు ఉన్నారు.

చాకర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం



పూజలో పాల్గొన్న రైల్వే అధికారులు

సోమందేపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న చాకర్లపల్లి రైల్వేస్టేషన్ సేవలు సోమవారం ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. రైల్వే అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి సేవలను ప్రారంభించారు. చేనేత వస్త్ర పరిశ్రమకు పేరొందిన సోమందేపల్లిలో నేతన్నలు తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించేందుకు గతంలో చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌ను వినియోగించుకునేవారు. విద్యార్థులు, సమీప గ్రామస్థులు ఈ స్టేషన్ నుంచి ప్రయాణం చేసేవారు. కొన్నేళ్ల క్రితం వివిధ కారణాలతో సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత యేడాది పెనుకొండ సమీపంలో తిమ్మాపురం వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే ఓవర్‌బ్రిడ్జి ప్రారంభించడానికి వచ్చిన రైల్వేసహాయ మంత్రి సోమన్నను కలిసి ఎంపీ బీకే పార్థసారథి స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన యేడాది లోపు చాకర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం, బ్రిడ్జి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన నిధులు సమకూర్చడంతో మరమ్మతులు పూర్తిచేసుకుని రైల్వేస్టేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. హైలెవెల్, ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి, టికెట్ కౌంటర్, అన్నివిభాగాలను తీర్చిదిద్దడంతో ప్రజలకు రైల్వే సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైల్వే అధికారులు నాగభూషణం, కిరణ్‌కుమార్, పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు.

వసతి గృహాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు వసతి గృహాలలో ప్రవేశాలకు దరకాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు అర్చన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతపురం హెచ్ఎల్‌సీ కాలనీలో బాలుర హాస్టల్, అరవిందనగర్‌లో బాలికల హాస్టల్ ఉన్నాయని వివరించారు. 100 మంది బాలురు, 50 మంది బాలికలకు అవకాశం ఉందని తెలిపారు. మూడో తరగతి నుంచి డిగ్రీ చదువుకునే శారీరక బధిరులు, అంధులు అర్హులన్నారు. ఉచిత వసతి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, ట్రంకుపెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కాస్మోటిక్ చార్జీలు ఇస్తామని అన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

- రూ.19 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం
- ఏడుగురిలో నలుగురు మైనర్లు
- జువైనల్ కోర్టుకు నిందితులు



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): నకిలీ తాళాలతో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే ముఠాను అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇళ్లు, పార్కులు, ఆసుపత్రులు, ఇతర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యంగా చోరీ చేసే ఏడుగురు సభ్యులున్న ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.19లక్షల విలువైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జువైనల్ కోర్టుకు హాజరు పరిచారు. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, 4వ పట్టణ సీఐ జగదీష్, టూ టౌన్ ఎస్ఐ రుషేంద్రబాబుతో కలిసి సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ముఠా సభ్యులు వీరే..

ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన యతేంద్ర అలియాస్ శివ(20) టూవీలర్ల చోరీలో సిద్ధహస్తుడు. ఇతడిపై ఇప్పటికే 8 కేసులున్నాయి. అనంతపురం, ధర్మవరం, నల్లచెరువు, ఇతర ప్రాంతాల్లో రెండేళ్ల కిందట నుంచి టూవీలర్లు ఎత్తుకెళ్లిన కేసులున్నాయి. ఇతడితో పాటు ఆకుతోటపల్లి గ్రామానికే చెందిన యోగేశ్వర్‌రెడ్డి అలియాస్ యోగి(27), గంగానగర్‌కు చెందిన యశ్వంత్ కుమార్ అలియాస్ బన్నీ(19)తోపాటు మరో నలుగురు మైనర్లు ఓ ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడి వీరంతా నగరంలోని పలు ప్రాంతాల్లో టూవీలర్ల దొంగతనాలు చేసేవారు. నకిలీ తాళాలు ఉపయోగించి పార్కింగ్ చేసిన వాహనాలను సులువుగా ఓపెన్ చేసి ఎత్తుకెళ్లిపోతారు.

రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు

పోలీసులకు కొంతకాలంగా టూవీలర్ల చోరీలు తలనొప్పిగా మారాయి. వీటిపై టూటౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం నాయక్‌నగర్ వద్ద తనిఖీ చేస్తుండగా ఆటోలో అనుమానాస్పదంగా వెళ్తున్న ముఠా సభ్యులను పట్టుకున్నారు. వారిని విచారించగా చోరీల విషయం బయటపడింది. టూటౌన్, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.19 లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, ఒక లగేజీ ఆటో రికవరీ చేశారు. నిందితులను జువైనల్ కోర్టుకు హాజరు పరిచారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తొలగని సందిగ్ధత

గ్రేడ్-1 వీఆర్ఓల బదిలీలకు అంతరాయం

గ్రీవెన్స్ ఏర్పాటు చేయకపోవడంలో అంతర్యమేంటో..?



అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీలన్నీ ముగిశాయి. కానీ ఇంకా డెప్యుటేషన్లపై వివాదం నడుస్తోంది. గ్రేడ్-1 వీఆర్ఓల బదిలీలపై సందిగ్ధం నెలకొంది. గ్రేడ్-2 వీఆర్వోల బదిలీలు చేపట్టినా గ్రేడ్-1 వీఆర్వోల బదిలీలు నిలిచిపోయాయి. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా జిల్లా కలెక్టర్ శిక్షణ నిమిత్తం ముస్సోరికి వెళ్లడంతో బదిలీలు ఇప్పుడే జరిగేలా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులకు గత నెల 30లోపు బదిలీల ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ మరో వారం రోజులు ఆలస్యమైంది. దీంతో గ్రేడ్-1 వీఆర్ఓలు సచివాలయాల్లోనే పని చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 600 మంది

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 600మంది గ్రేడ్-1 వీఆర్వోలు పని చేస్తున్నారు. వీరిలో 80 నుంచి 100మంది వరకు ఒకే చోట ఐదేళ్ల పూర్తయినవారున్నారు. మెడికల్, స్పౌజ్ ఇతర కారణాలతో బదిలీపై వెళ్లాలనుకునే వారు 200మంది వీఆర్వోలున్నట్లు తెలిసింది. బదిలీలు జరగకపోవడంతో ఆ వర్గాలకు ఎదురుచూపే మిగిలింది. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలను జేసీ, డీఆర్ఓల ఆధ్వర్యంలో చేపడతారు. వీఆర్ఓ, తహసీల్దార్లను కలెక్టర్, డీఆర్ఓల ఆధ్వర్యంలో చేస్తారు. కలెక్టర్ ముస్సోరికి శిక్షణకు వెళ్లడంతో గ్రేడ్-1వీఆర్ఓల బదిలీలు ఎప్పుడు జరుగుతాయనేది ప్రశ్నగానే మిగిలిపోయింది.

అడుగుతారనేనా..?

ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించాలి. తాజాగా ఈనెల18న ఉద్యోగుల గ్రీవెన్స్ రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. కానీ జిల్లాలో జరగలేదు. వీఆర్వోల బదిలీలపై ఉద్యోగులు అడుగుతారనే ఉద్దేశంతోనే గ్రీవెన్స్ నిర్వహించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరి ఉద్యోగులు ప్రశ్నకు అధికారులు ఏం సమాధానమిచ్చేవారో తెలియదు కానీ గ్రీవెన్స్ మాత్రం రద్దయింది. గ్రీవెన్స్ నిర్వహించకపోవడం వెనుక అధికారుల అంతర్యమేంటో వారికే తెలియాలి.

జీతాలు ఇంకా రాలే..!

అప్‌గ్రేడ్ హైస్కూళ్ల పాత టీచర్లకు అందని వేతనాలు

కొత్త హెచ్‌ఎంలకు పొజిషన్ ఐడీలు రాకపోవడమే కారణం

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఈఏడాది అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాల టీచర్లు జూన్ నెల జీతాల కోసం నేటికీ ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఈసారి అనేక ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. విద్యాశాఖ అధికారిక లెక్కల మేరకు ఉమ్మడి జిల్లాలో 78 ప్రాథమికోన్నత పాఠశాల లను అప్‌గ్రేడ్ చేశారు. ఇలా అప్‌గ్రేడ్ అయిన ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక గ్రేడ్-2 హెచ్‌ఎంను కేటాయించి, ఇటీవల జరిగిన బదిలీలలో అక్కడ పోస్టును కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జూన్ జీతాలు ఇప్పటికీ అందలేదు. అందరికీ ఈనెల ఒకటో తేదీనే జీతాలు వచ్చాయి. కానీ ఇక్కడ పని చేస్తున్నవారికి రాలేదు. అప్‌గ్రేడ్ కాని స్కూళ్లలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గతంలో ఎంఈఓ డీడీఓగా వ్యవహరిస్తు, జీతాలు చేసేవారు. ఇపుడు హైస్కూల్ కావడంతో పాటు ఆపాఠశాలలకు హెచ్‌ఎంను కేటాయించారు. అక్కడ జీతాలు చేయడానికి హెచ్‌ఎం డీడీఓగా వ్యవహరిస్తారు. అయితే అక్కడకు వచ్చిన హెచ్‌ఎంలకు డీడీఓగా కోడ్‌లు ఇచ్చారు. కానీ పొజిషన్ ఐడీలు రాకపోవడంతో కొత్తగా వచ్చిన హెచ్‌ఎంలకు జీతాల బిల్లులు పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో అప్‌గ్రేడ్ కాకముందు నుంచి అదే పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గతనెల జీతాలు ఇప్పటివరకు అంద కుండా పోయాయి.

ఎంఈఓల ద్వారానే ఇప్పించండి

ఈనెల జీతాలు అందకపోవడంతో వివిధ రకాల బ్యాంకు రుణాల ఈఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్‌గ్రేడ్ కాకమునుపు మాకు ఎంఈఓలు డ్రాయింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తూ జీతాలు చేసేవారు. ఇపుడు క్యాడర్‌స్ట్రెంత్, పొజిషన్‌ఐడీ కేటాయింపులో ఆలస్యమౌతోంది. దీంతో వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఈనెల గతంలో మాదిరే ఎంఈఓల ద్వారానే జీతాలు ఇప్పించి, మా ఇబ్బందులు తీర్చాలి.

- మహ్మద్‌రఫీ, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పచ్చి రొట్టతో ఎరువులు ఆదా

ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట పైర్లను వాడటం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా అవుతాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చిరొట్టకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా నేలసారం పెరుగుతుందని, నేల నిర్మాణం పటిష్టమవుతుందని, నేల ఆరోగ్యకరంగా ఉంటుందని వివరించారు. జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చని, జీవన ఎరువులతో పంటకు బలం చేకూరుతుందన్నారు. జీవన ఎరువులు (బయోఫర్టిలైజర్స్) వాడేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు, కీటక నాశకాలతో కలిపి వేయకూడదని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని సూచించారు.

8 మంది బధిరులకు టచ్ ఫోన్లు పంపిణీ

వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 8 మంది బధిరులకు టచ్ ఫోన్లను ఇన్‌చార్జ్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.15వేల విలువైన టచ్ ఫోన్లను ఇంటర్ అర్హత కలిగిన 8 మంది బధిరులకు టచ్ ఫోన్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, రామ్మోహన్, మల్లికార్జునుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వికలాంగుల శాఖ ఏడీ అర్చన, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ఇంజనీర్లతో సీఈ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న సీఈ

అనంతపురం న్యూటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ ఇంజనీర్ అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురం, కర్నూలు జిల్లాలకు సంబంధించిన పీఐయూ ఇంజనీర్లతో పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో సీఈ అశోక్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పీఐయూలో అమలు అవుతున్న ఏపీఆర్ఆర్‌పీ (ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు)లో అమలు జరుగుతున్న ప్రాజెక్టులకు సంబంధించి ఒక్కొక్కటిగా సమీక్షించారు. 138 రోడ్లు అనుమతులు పొందగా రూ.209 కోట్లతో పనులు చేపట్టారు. ఇందులో 52 పనులు పూర్తి చేశారు. మరో 42 పనులు జరుగుతున్నాయి. 44 పనులకు సంబంధించి చాలా కాలంగా పురోగతి లేకపోవడంతో రద్దు చేశారు. రద్దు చేసిన వాటిని మార్పు చేసి వచ్చే ఏడాది మార్చి ఆఖరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటికి సంబంధించి రూ.101 కోట్లు ఖర్చు చేయగా.. 195.71 కిలోమీటర్ల పొడవుతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. సత్యసాయి జిల్లాలో 230 రోడ్లకు సంబంధించి అనుమతులు పొందారు. రూ.194 కోట్లు కేటాయించారు. ఇందులో 119 పనులు పూర్తయ్యాయి. 28 పనులు నిర్మాణంలో ఉన్నాయి. 45 పనులు చాలా కాలంగా పెండింగ్ ఉండటంతో రద్దు చేశారు. పురోగతి లేని పనులను రద్దుచేసి, మార్పుచేసి వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. సమావేశంలో అనంతపురం ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి, ఈఎన్‌సీ కార్యాలయ ఈఈ రమణమూర్తి, సత్యసాయి జిల్లా ఈఈ శంకరయ్య, కర్నూలు ఈఈ వెంకటేష్, నంద్యాల ఈఈ రఘురామరెడ్డి, డీఈ లు నారాయణస్వామి, ఆనంద్‌బాబు, నాగేంద్రకుమార్, మదన్‌మోహన్, తిరుమలరెడ్డి, మధుప్రకాష్‌రెడ్డి, హనుమంతయ్య పాల్గొన్నారు.

14 మండలాల్లో వర్షం



అనంతపురం క్లాక్ టవర్ వద్ద కురుస్తున్న వర్షం

అనంతపురం అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా యాడికిలో 32.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. పెద్దపప్పూరు 21.2, గుంతకల్లు 17.2, శింగనమల 5.8, తాడిపత్రి 5.2, పుట్లూరు 4.4, వజ్రకరూరు 4.0 మీ.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 2.2 మీ.మీలోపు వర్షపాతం నమోదైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతపురం నగరం, గుత్తిలో ఓ మోస్తారు వర్షం పడింది. బెలుగుప్ప, కళ్యాణదుర్గం, కూడేరు, ఉరవకొండ, శెట్టూరు, ఆత్మకూరు, పుట్లూరు, శింగనమల తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

హనుమాన్ దర్శన్‌కు ప్రత్యేక బస్సులు

అనంతపురం టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి హనుమాన్ దర్శన్ కోసం బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతియేటా శ్రావణ మాసంలో ఒకే రోజు మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునేలా కసాపురం, మురడి, నేమకల్లు క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19వ తేదీల్లో బస్సు సర్వీసులు నడపుతామని అన్నారు. డిపోల వారీగా టికెట్ ధరలను నిర్ణయించామని పేర్కొన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

- రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం



ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. సోమవారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్ ప్రకటించారు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో హర్షవర్ధన్‌రెడ్డి, మనోజ్, అశోక్‌బాబు, సాయిప్రసాద్, శివాజీ, సాయిచరణ్, రామ్‌చరణ్, ధనుష్, శివచరణ్, నవదీప్, జయవర్ధన్, అభిలాష్, భానుప్రసాద్, శేఖర్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో...హిమబిందు, భవాని, జ్యోతిక, అంజలి, చంద్రకళ, అమృత, భార్గవి, ప్రణీత, ప్రణయ, సుచిత్ర, నిత్య, సాయిజోష్ణవి, నవ్యశ్రీ, జయశ్రీ, దివ్యశ్రీ, విద్యారెడ్డి ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో మదన్, జిలాన్, నిఖిల్, చిరంజీవి, రాజశేఖర్, హర్షవర్ధన్, అల్తాఫ్, సుధీర్, జగదీష్, ఇబ్రహీం, ప్రదీప్, చందు, వినయ్, బాలాజీకి చోటు దక్కింది. బాలికల విభాగంలో వెంకటలక్ష్మి, గౌతమి, మానస, గౌతమిబాయి, అమృత, చరిత, మహేశ్వరి, మదీనా, కమలాక్షి లోకేశ్వరిబాయి, విద్యారెడ్డి, సింధూజా, జశ్విత ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో వెంకటేశులు, ఇమామ్, షరీఫ్, నారాయణ స్వామి, అశోక్, అనిల్, సునిల్, హరికృష్ణ, శ్రీనాథ్, దుర్గాసాయి, రవికి చోటు దక్కింది. సీనియర్ మహిళల విభాగంలో ...పావని, గంగోత్రి, హేమ, అమృత, లక్ష్మీదేవి, హరిత, నిఖిల, గౌతమి, వందన, వినీల, సుస్మిత, భారతి, వెంకటలక్ష్మి, మహేశ్వరి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఆయా ప్రాంతాల్లో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టు

ప్రాబబుల్స్‌లో ఐదుగురికి చోటు



గిరినాథ్‌రెడ్డి వినయ్‌కుమార్ దత్తారెడ్డి అర్జున్ టెండూల్కర్ రాజుకుళ్లాయప్ప

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌లో జిల్లాకు చెందిన ఐదుగురు క్రీడాకారులకు చోటు దక్కింది. గిరినాథ్‌రెడ్డి, వినయ్‌కుమార్, ఎంకే దత్తారెడ్డి, అర్జున్ టెండూల్కర్, రాజుకు ళ్లాయప్ప ఆంధ్రా సీనియర్ పురుషుల వన్డే రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు విజయనగరంలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

బీజేపీ జిల్లా కమిటీ ఎంపిక

పుట్టపర్తిరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ సోమవారం ప్రకటించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా జ్యోతిప్రసాద్ (పుట్టపర్తి), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా తలమర్ల హరికృష్ణ (పుట్టపర్తి), ఆమరా దేవేంద్ర (హిందూపురం), సాకే ఓబుళేసు (ధర్మవరం), జిల్లా ఉపాధ్యక్షులుగా కె.రాంమోహన్ (కదిరి), షేక్‌ముంతాజ్ (పెనుకొండ), తిరుమలేష్ (హిందూపురం), పురుషోత్తం (మడకశిర), జింకా రామాంజనేయులు (ధర్మవరం), కార్యదర్శులుగా డోలా రాజిరెడ్డి(ధర్మవరం), హనుమంతరెడ్డి (పుట్టపర్తి), రమ్య (పెనుకొండ), కునుమ జయరాం (పుట్టపర్తి), టి. ఆనంద్, (కదిరి), వేణుగోపాల్ (పెనుకొండ), జిల్లా ఐటీ సెల్ కన్వీనర్‌గా వై. భాస్కర్ (పుట్టపర్తి), జిల్లా కోశాధికారి ముత్యాల సురేంద్రబాబు (పుట్టపర్తి)ను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం బీజేపీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని శేఖర్ పిలుపునిచ్చారు.

25 నుంచి ఆర్జిత కల్యాణోత్సవాలు

కదిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 27, 30, 31, ఆగస్టు 3, 4, 5, 10, 11, 12, 13, 18, 19, 20, 21, 24, 25 తేదీల్లో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒకరోజుకు ఐదు కల్యాణం టిక్కెట్లు జారీ చేస్తామన్నారు. ఒక్కొక్క టిక్కెట్ ధర రూ.6,500 అన్నారు. ఒక టిక్కెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు: డీఆర్వో

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): చుక్కల భూములు, 22ఏ ఫైల్స్ పరిష్కరించే విషయంలో ఏ అధికారి అయినా అవినీతి పాల్పడితే విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్వో మలోల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన, జేసీ, డీఆర్ఓలు, సంబంధిత తహసీల్దార్ల సమక్షంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఇప్పటి వరకు గత మూడు సమావేశాల్లో 163 చుక్కల భూములు, 22ఏ ఫైల్స్‌ను పరిశీలించామన్నారు. ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

జలధికి తరలిన పీర్లు



వేణుగోపాల్ నగర్‌లో జలధికి తరలుతున్న పీర్లు

అనంతపురం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ వేడుకలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఉదయం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అలాగే సాయంత్రం జలధికి తరలించారు. వేణుగోపాల్‌నగర్‌లోని 80 అడుగుల రోడ్డులో తారకరామ కొట్టాల వద్ద బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్, ఇమామ్ హుసేన్‌ల పీర్లు జలధికి తరిలాయి. ఉదయం పురవీధుల్లో పీర్లను ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం పీర్లను ఊరేగిస్తూ హెచ్చెల్సీలో సంప్రదాయబద్ధంగా జలధి నిర్వహించారు. బుధవారం ఉదయం పీర్ల చివరి దర్శనం నిర్వహించడంతో పాటు అదేరోజున సాయంత్రం భక్తులకు అన్నదానం చేసి ఉత్సవాలను ముగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు వెల్లడించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు జెబీవుల్లాఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

● తూతూమంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ఉదయం 11:30 అయినా ముగ్గురు అధికారులే హాజరైన దృశ్యం

శింగనమల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల అధికారులు సమయపాలన పాటించలేదు. ఉదయం 11:30 గంటలు అయినా కేవలం ముగ్గురు అధికారులు మాత్రమే హాజయ్యారు. ఆ తరువాత మిగతా అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోయారు. దీంతో కార్యక్రమం తూతూమంత్రంగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయం నుంచి గత నాలుగు నెలలుగా ఒక్క అధికారి కూడా హాజరుకాకపోవడం గమనార్హం. ఈ విషయంపై తహసీల్దార్ శేషారెడ్డి వివరణ కోరగా..ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రాని అధికారులకు మోమోలు జారీ చేస్తామన్నారు. వచ్చే వారం నుంచి చర్యలు తీసుకుటామని పేర్కొన్నారు.

బుడగజంగాల సమస్యల్ని పరిష్కరించాలని వినతి



కలెక్టరేట్‌లో బుడగజంగాలతో బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సోములదొడ్డి గ్రామ సమీపంలోని బుడగజంగాల వారి సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ.. సోములదొడ్డి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన 125, 126, 17 సర్వే నంబర్లలో బుడగజంగాల వారు గత రెండేళ్లుగా గుడిసెలు వేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అక్కడ కనీస వసతులైన తాగునీరు, విద్యుత్ కనెక్షన్లు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. దీనికి తోడు వారిపై కొందరు బెదిరింపులకు , దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. జంగంహక్కుల పోరాట సమితి సభ్యుడు తాటికొండ నాగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం: వైసీపీ

నార్పల, జూలై 21(ఆంధ్రజ్యోతి): జరగని స్కామ్‌ను జరిగిందంటూ రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నాయకుడు నార్పల సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారం ఉంది కదా అని కక్ష సాధింపులకు పాల్పడుతున్న ఈ పాలకులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో ఎంపీపీ నాగేశ్వరరావు, మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్, సిద్దిరాచర్ల సర్పంచ్ రామాంజినేయులు, ఉప సర్పంచ్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడి హౌస్ అరెస్టు



ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటనను అడ్డుకుంటామని పిలుపునివ్వడంతో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆదివారం ఆయన ఆందోళన చేపట్టి మడకశిరలో హోం మంత్రి పర్యటనను అడ్డుకుంటామని అన్నారు. ఈ క్రమంలో పోలీసులు అదేరోజుఅర్ధరాత్రి అతడిని హౌస్ అరెస్టు చేశారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ సోమవారం వైసీపీ నాయకులు నాయక్‌నగర్‌లోని చంద్ర ఇంటివద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయడానికి వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారన్నారని పోలీసులను ప్రశ్నించారు. నాయకులు దాదాఖలందర్, శ్రీనివాసులు, శివయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోమంటే.. హౌస్ అరెస్టు చేయడమేంటి?

అనంతపురం కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): అఘాయిత్యానికి గురైన ఆడబిడ్డకు న్యాయం చేయమన్న వైసీపీ నాయకులను అర్ధరాత్రిళ్లు హౌస్ అరెస్టులు చేయడమేంటని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. బాలికకు జరిగిన అన్యాయంపై హోంమంత్రి అనితను ప్రశ్నిస్తారన్న భయంతో వైసీపీ నాయకులను అర్ధరాత్రి గృహనిర్బంధం చేశారన్నారు. అంతేగాక వైసీపీలో ముఖ్యనాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దుల అమర్నాథ్ రెడ్డి, నరసింహులు, కమల్‌భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన ఏడీసీసీబీ చైర్మన్

బుక్కరాయసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి మడకశిరలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ప్రారంభం కాకనే.. దెబ్బతింది!

● గుంతలు పడిన అనంతపురం- చెన్నై, హైదరాబాద్-బెంగళూరు హైవేల లింక్‌రోడ్డు
● నిర్వహణ లోపంతో డివైడర్ మధ్య ఏపుగా పెరిగిన కంపచెట్లు



కందుకూరుకు వెళ్లే రోడ్డు వద్ద గల లింక్‌రోడ్డుపై భారీగా పడిన గుంతలు

అనంతపురంరూరల్, జూలై21(ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డు నిర్మాణం ప్రారంభమై కొన్నేళ్లు గడుస్తోంది. అప్పుడప్పుడూ పనులు జరుగుతున్నట్లు కనిపించడం తప్పా.. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయింది లేదు. కొద్దోగొప్పో పూర్తయిన చోట మాత్రం పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. హైవే కదా అని ఎవరైనా బండి స్పీడు పెంచితే.. అంతలోనే గుంతలతో బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది.

మలుపులో పెద్ద గుంతలు..

మండలంలోని ఆకుతోటపల్లి సమీపంలో గ ల అనంతపురం-చెన్నై హైవేకు రాప్తాడు మం డలకేంద్రంలోని బెంగుళూరు-హైదరాబాద్ హైవే నుంచి లింక్‌రోడ్డు నిర్మాణం జరుగుతోం ది. ఆ రోడ్డు పనులు జరగబట్టి చాలా ఏళ్లు కా వస్తోంది. అయితే మండలంలోని కందుకూరుకు వెళ్లే రోడ్డు నుంచి ఆకుతోట పల్లి వద్ద ఉన్న చెన్నై హైవే వరకు మాత్రమే నిర్మాణం పూర్తయింది. ఇటువైపు ఉన్న మిగతా సగం పనులు ఇంకా పూర్తి కాలేదు. పనులు కూడా జరుగుతున్నట్లు లేవు. రైల్వే గేట్ల వద్ద మాత్రం బ్రిడ్జి పనులు అడపా.. దడపా జరుగుతున్న ట్లు కనిపిస్తోంది. ఇక కందుకూరుకు వెళ్లే రోడ్డు నుంచి చెన్నై హైవే వరకు రోడ్డు నిర్మా ణం పూర్తవడంతో వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అయి తే కందుకూరు రోడ్డు వద్ద లింక్‌రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకర తేలిపోవడంతో పాటు పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోడ్డు బాగుంది కదా అని ఎవరైనా బండి స్పీడు పెంచితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే పంగల్ రోడ్డులో నుంచి కందుకూరుకు వెళ్లే రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్దవాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో మలుపులో రోడ్డు పూర్తి గా దెబ్బతింది. ఈ రెండు చోట్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వాహనదారులంటున్నారు. రాత్రివేళల్లో అయితే మరింత ఇబ్బందవుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఆ సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ఏపుగా పెరిగిన ముళ్లకంపలు..

ఇదిలా ఉండగా నిర్మాణం పూర్తియిన లింకు రోడ్డుకు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ డివైడర్ నిర్వాహణను సంబంధిత అధికారులు పూర్తిగా గాలికి వదిలేశారు. రాత్రివేళల్లో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు డివైడర్‌పై మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోయాయి. వాహనదారులకు వీటితోనూ ఇబ్బందులు తప్పడం లేదు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
● మన్నీలలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పరిటాల సునీత తదితరులు

అనంతపురంరూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని మన్నీల గ్రామంలో సోమవారం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అలాగే కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. వచ్చే నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఇక్కడికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. తొలుత ఆమె ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.20లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో రాప్తాడుమార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పెద్రావలి నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాముదాయి రఘు, రాగేమురళీమోహన్, సర్పంచ్ త్రిలోక్‌నాయుడు, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు చల్లానాయుడు, అల్లుగోపాల్, జయప్రకాష్, అల్లు రామాంజి, రమేష్‌నాయుడు, బయన్న, డీలర్లు కప్పలరాము, వెంకటరాముడు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మన్నీలలో సమస్యలు పరిష్కరించాలి

అనంతపురంరూరల్: మన్నీల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు కోరారు. ఆ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యుడు పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడిమిలో మడుగు తొలగింపునకు చర్యలు

● తాత్కాలికంగా కొంతవరకు కాలువ తవ్వించిన అధికారులు



తాత్కాలికంగా కాలువను తీయిస్తున్న అధికారులు

అనంతపురంరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి గ్రామంలో నీటి మడుగు తొలగింపున కు మండల అధికారులు చర్యలు చేపట్టారు. ఊరు నడిమధ్యలో ఒక వైపు మురుగునీరు, మరోవైపు వర్షపు నీరు నిలుస్తుండడంతో జనం ఇంటి నుంచి బయటకు రాలేక అవస్థలు పడుతుండడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో కొడిమిలో మడుగు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ దివాకర్, తహసీల్దార్ మోహన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు తదితరులు మధ్యాహ్నం నుంచి పోలీసుల సహకారంతో మడుగు తొలగింపు చర్యలు చేపట్టారు. రెండు ఎక్సకవేటర్లను ఏర్పాటు చేసి నీరు వెళ్లడానికి తాత్కాలిక కాలువను తవ్వించారు. కాగా పట్టా భూముల్లో కాలువ తీయడంతో సంబంధిత భూ యజమానులు అడ్డుపడ్డారు. దీంతో మిగిలిన పనుల్ని మంగళవారం మరింత పోలీసు బందోబస్తుతో పూర్తి చేస్తామని అధికారులు సాయంత్రం ఇంటిముఖం పట్టారు. వీఆర్వో రమేష్, సర్వేయర్లు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే రోడ్డు, డ్రైనేజీకాలువ నిర్మిస్తాం..

అనంతపురంరూరల్: కొడిమిలో ప్రధాన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పేర్కొన్నారు. గ్రామంలో ఆయన, క్లస్టర్ ఇన్‌చార్జి పాములాయి రఘు, టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా నడి ఊరులో నిలిచి ఉన్న నీటిని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పరిటాల సునీత నేతృత్వంలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నీరు నిల్వకుండా త్వరలోనే రోడ్డు, డ్రైనేజీకాలువలు నిర్మిస్తామని అన్నారు. ఇందుకు రూ.20లక్షలు నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు సైతం నివేదించినట్లు పేర్కొన్నారు. టీసీ సెల్ మండల అధ్యక్షుడు బ్యాళ్లరాము, నాయకులు నాగార్జున, బాలన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

జాషువా వర్ధంతికి తరలిరండి

అనంతపురం వైద్యం, జూలై21(ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఈ నెల 24వ తేదీ న పూలమాలల అలంకరణ చేపట్టనున్నట్లు జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని అన్నారు. ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

అనంతపురం క్రైం,జూలై 21(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తులు సోమవారం మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం అత్తకూరు గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ రెడ్డి(38) నగరంలోని పంగల్ రోడ్డులో నివాసం ఉంటున్నాడు. కాగా ఆదివారం సాయంత్రం ఆయన నగరంలోంచి పంగల్ రోడ్డు వైపునకు బైక్‌పై వెళ్తూ.. టీవీ టవర్ సమీపంలో రోడ్డు దాటుతున్న వెంకటరమణాచారి(78)ని ఢీ కొన్నాడు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఇద్దరూ మృతి చెందారు.

పాత పద్ధతినే అమలు చేయాలని నిరసన



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న మహిళలు

శింగనమల, జూలై 21(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హోమ్ రేషన్‌తో పాటు ఇతర సేవల కొరకు ఎఫ్‌ఆర్‌ఎస్ (లబ్ధిదారుల ముఖచిత్రం ధృవీకరణ) తప్పనిసరి చేశారని, దీనిని వెంటనే రద్దు చేసి పాతపద్ధతినే అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం వారు పెద్దఎత్తున చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ గతంలో అంగన్వాడీ కేంద్రాల్లో పోషికాహారాన్ని తదితరాలను గర్భిణులు, బాలింతలు లేక వారి కుటుంబ సభ్యులు వచ్చి సంతకం చేసి తీసుకెళ్లే వారని అన్నారు. అయితే ఇప్పుడు లబ్ధిదారుల ముఖచిత్రాన్ని నమోదు చేయించుకుని వాటిని అందజేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులు రాలేని పరిస్థితిలో వారి కుటుంబసభ్యులకు ఇవ్వాలంటే ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఫేస్ నమోదుకు గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరగాలంటే ఎలా సాధ్యమవుతుందని వాపోయారు. పాతపద్ధతిలోనే పౌష్టికాహారం అందజేయాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ అధికారి గాయత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వావాడీ కార్యకర్తలు రమణమ్మ,భారతి,ప్రమీలా,రామాంజినమ్మ,రుషింగమ్మ,హెల్పర్లు నారాయణమ్మ, రమణమ్మ,వినీత,పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

చిత్రకళ, నృత్య పోటీల్లో ప్రతిభ



ప్రతిభావంతవిద్యార్థులతో కరస్పాండెంట్

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గత రెండురోజుల క్రితం జరిగిన పలు పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన ఆదర్శ ఫైన్ ఆర్ట్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. చిత్రకళ, నృత్యం పోటీలు నిర్వహించగా.. జ్యోతి, వంశీ, ఫిలిప్స్ అత్యంత ప్రతిభ చూపి అక్కడే అల్లూరి సీతారామరాజు జిల్లా విజ్ఞానకేంద్రంలో కళా కేంద్ర ప్రెసిడెంట్ అర్పితచక్రవర్తి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ వినోద్‌కుమార్ సోమవారం స్కూల్లో అభినందించారు.

30న మహాధర్నా

అనంతపురం వైద్యం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 30వ తేదీన మహాధర్నాను తలపెట్టినట్లు దళిత, గిరిజన ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో వారు సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో అట్రాసిటీ కేసులను నీరుగార్చారన్నారు. బాధితులకు పరిహారం చెల్లించకుండా అన్యాయం చేశారని వాపోయారు. దాడులు చేసిన వారిని శిక్షించకుండా బాధితులపై కౌంటర్ కేసులుపెట్టి వేధింపులకు గురిచేశారని గుర్తుచేశారు. ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయాలంటూ అంబేద్కర్ విగ్రహంవద్ద తలపెట్టి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నారాయణస్వామి, ఓబులేసు, ఎల్లన్న, చిన్నకేశవులు, ఓబుళపతి, చిన్న అంజనేయులు, రవిరాజ, నగేష్, బానాసి శీను, శివశంకర్, వరప్రసాద్, పక్కీరప్ప, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ డిపో కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కార్యవర్గం

అనంతపురం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) అనంతపురం డిపో నూతన కార్యవర్గం ఎంపికైంది. స్థానిక పీవీకేకే డిగ్రీ కాలేజీ సమావేశ మందిరంలో సోమవారం ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు యన్‌వీ రమణ, భాస్కర్‌నాయుడుల సమక్షంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఆర్‌ఎన్ రెడ్డి, కార్యదర్శిగా రామాంజనేయులు, గ్యారేజ్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా ఓబయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ కడప జోన్ ఉపాధ్యక్షుడు పుల్లయ్య, సంయుక్త కార్యదర్శి డీఎన్ రెడ్డి, జిల్లా చైర్మన్ నూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు హంపాపురంలో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని చెప్పారు. అలాగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నిజపాద దర్శనం



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి

అనంతపురం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కామికా ఏకాదశిని పురస్కరించుకుని రామ్‌నగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో సోమవారం నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవారి మూలవిరాట్లకు పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భవసార క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవినీతిని అరికట్టండి: టీడీపీ

బుక్కరాయసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టాలంటూ ఎంపీడీఓ సాల్మన్‌రాజ్‌ను టీడీపీ నాయకులు కోరారు. మండల కన్వీనర్ అశోక్‌కుమార్, పలువురు నాయకులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లి ఎంపీడీఓతో మాట్లాడారు. చాలా గ్రామాల్లో గోకులం షెడ్ల బిల్లుల చెల్లింపులో ఉపాధి సిబ్బంది గోల్‌మాల్ చేస్తున్నారని మండిపడ్డారు. గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులకు ఒక్కరికి రూ.2.34లక్షలకు గాను 10 శాతం రైతు వాటా పోగా మిగిలిన మొత్తం రూ.2లక్షల 14 వేల వరకు బిల్లు మంజూరు కావాల్సి ఉందని, అయితే కేవలం రూ.1.50 లక్ష వరకే పడుతున్నాయని తెలిపారు. కొంత మందికి నిర్మాణం చేపట్టకపోయినా పూర్తి బిల్లులు పడుతున్నాయని ఆరోపించారు. గోకులం షెడ్ల బిల్లుల్లో అవినీతి విచ్చలవిడిగా జరుగుతోందని, దీనిపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

అనంతపురం అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఆదేశించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం ఆయన అనంతపురం డివిజన్ పరిధిలోని ఏఓలతో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ పంటల సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఓలు వెంకటకుమార్, సోమశేఖర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సుభాకర్, కృష్ణచైతన్య విజయజ్యోతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీ సమావేశాల పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అనంతపురం విద్య, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆగస్టు 4,5వ తేదీల్లో శింగనమలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పరమేష్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలపై చర్చించేందుకు ప్లీనరీ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం కోరారు. నాయకులు రజిత, రమేష్, గిరి, సూర్యప్రకాష్, భీమేష్, వెంకటేష్, శివ,వంశీ,పవిత్ర పాల్గొన్నారు.

ఇద్దరికి 14 రోజుల రిమాండ్

అనంతపురం క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని 14 రోజుల రిమాండ్‌కు పంపారు. త్రీటౌన్ సీఐ శాంతిలాల్ సోమవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక గుత్తిరోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి బహిరంగ మద్యపానం చేస్తున్నట్లు సమాచారం రావడంతో.. కానిస్టేబుల్ గంగరాజు, హోంగార్డ్ రామాంజనేయులు సంఘటనా స్థలానికి వెళ్లారు. బుక్కరాయసముద్రం మండలం ఎల్బీనగర్‌కు చెందిన షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్ బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు గుర్తించి. ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని హెచ్చరించారు. అయితే మద్యం మత్తులో వాళ్ళు పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను మొబైల్ కోర్టు ఎదుట హాజరు పరచగా..14 రోజుల రిమాండ్ కోసం జైలుకు పంపారు.

ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగి మృతికి నివాళి

● మృతుడి కుటుంబానికి అండగా ఉంటామన్న చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి



రమేష్‌నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్యాంకు చైర్మన్, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు పామిడి బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగి రమేష్‌నాయక్ మృతి బాధాకరమని ఆ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. నగరంలోని సాయినగర్‌లో శనివారం సాయంత్రం రమేష్‌నాయక్ మృతి విద్యుత్‌షాక్‌తో చెందారు. ఇందుకుగాను సోమవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో గల ఏడీసీసీ బ్యాంకులో సంతాప సభ నిర్వహించారు. చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, సీఈఓ సురేఖరాణి, అధికారులు రమేష్‌నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ వేతనం రూ.80వేలు, వ్యక్తిగతంగా రూ.50వేలు, సీఈఓ వ్యక్తిగత ంగా రూ.5వేలు, ఉద్యోగులు ఒక రోజు వేతనం రూ.4.56లక్షలు మొత్తం మృతుడి కుటుంబానికి విరాళంగా ప్రకటించారు. అంతేగాక అతడి కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా, బ్యాంకు నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరలోనే అందజేస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంల బ్యాం కు డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్ బాబు, విజయచంద్రారెడ్డి, ఏజీఎం రవీంద్ర, సీనియర్ అధికారులు మేనేజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు జైలు తప్పదు: విప్




రాయదుర్గంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తొండపాడులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రచారం

రాయదుర్గం, జూలై 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో వైఎస్ జగన్ త్వరలో జైలుకు వెళ్లక తప్పదని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 22వ వార్డులో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిట్టింగ్ ఎంపీ మిథున్‌రెడ్డి కేంద్రంగా జరిగిన భారీ కుంభకోణంలో అసలు సూత్రధారులు, పాత్రదారులు, భాగస్వాములు, ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. రూ. వేల కోట్ల సొమ్ము అంతిమ లబ్దిదారు తాడేపల్లి ప్యాలెస్ యజమానేనని ప్రత్యేక దర్యాప్తు బృందం ఆధారాలతో రుజువు చేయబోతోందన్నారు. సమగ్ర వివరాలతో త్వరలో ఛార్జ్‌షీట్ సమర్పించబోతోందన్నారు. జగన్‌రెడ్డితో పాటు ఎవరైతే వున్నారో వాళ్ళందరూ జైలు ఊచలు లెక్కించక తప్పదన్నారు.

● గుత్తిరూరల్ : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మండలంలోని తొండపాడు గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఇందులో కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు బర్డీవలి, ఏంకే చౌదరి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రతాప్, సింగల్ విండో ప్రెసిడెంట్, శివశంకర్ టీడీపీ నాయకులు, చికెన్‌శీనా, చిన్నరెడ్డి యాదవ్, ఇషాక్, సాంబ శివ, రామచంద్ర, చిన్నతిమ్మప్ప, గోవర్ధన్ గౌడ్, మాబు, సోము, నూరీ, రామాంజిని, చంద్ర రమణ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ మండలంలోని రేకులకుంట గ్రామంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు ఆవులదట్ల సర్పంచ్ వన్నూరుస్వామి, జుంజురంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, నాయకులు కాటా వెంకటేశులు, సోమశేఖర్, తిమ్మారెడ్డి, గోవిందరాజులు, రామస్వామి, ప్రసాద్, ఆంజనేయులు, రామాంజనేయులు, ఉమేష్, చిక్కణ్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.



రేకులకుంటలో కాలవ భరత్ ఇంటింటి ప్రచారం

ప్రజా సమస్యలపై అదే నిర్లక్ష్యం

● పరిష్కార వేదికకు డుమ్మా
● పట్టించుకోని ఉన్నతాధికారులు




డీ.హీరేహళ్‌లో ఖాళీగా ఉన్న కుర్చీలు, ఉరవకొండలో అధికారులకు బదులుగా హాజరైన సిబ్బంది

డీ.హీరేహళ్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అదే తీరు ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా కొత్త ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్య పరిష్కార వేదికకు డమ్మా కొడుతున్నారు. డీ.హీరేహాళ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఒకరిద్దరు అధికారులు తప్పా. మిగిలిన అధికారులు ప్రతిసారీ డుమ్మా కొడుతూనే ఉన్నారు. ఈ పరిస్థితి కొన్ని ఏళ్లుగా ఇలాగే కొనసాగుతూనే ఉంది. అయినా జిల్లా స్థాయి అధికారులు ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేవలం తహసీల్దార్, గృహ నిర్మాణ శాఖ అధికారి మాత్రమే హాజరయ్యారు.

● ఉరవకొండ : పట్టణంలో తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు ఇలా వచ్చి, అలా వెళ్లి పోయారు. వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కాకుండా క్రింది స్థాయి సిబ్బందిని పంపి, చేతులు దులుపుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రెండు వారాల నుంచి సమావేశానికి వచ్చి సంతకం చేసి వెళ్లి పోతున్నారు. ప్రతి వారం ఆయనకు బదులుగా వర్క్ ఇన్‌స్పెక్టర్ హాజరవుతున్నారు. ఐసీడీఎస్, ఏఎస్‌డబ్ల్యూఓ, ఆర్టీసీ అధికారుల పరిస్థితి కూడా అలాగే ఉంది.

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శారద



తాడిపత్రి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్వకుళశాలి సమాజం కార్యవర్గ సమావేశాన్ని అనంతపురం అంబాభవానీ ఆలయంలో సోమవారం నిర్వహించారు. ఇందులో తాడిపత్రికి చెం దిన శారదను స్వకుళశాలి సమాజ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నట్లు తాడిపత్రి ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

రేపు బుగ్గరామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

తాడిపత్రి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. తెల్లవారుజామున నుంచి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రం

శెట్టూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : యాటకల్లులో మంగళవారం నుంచి శుక్రవారం చిన్న పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జీలానీ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసు బందోబస్తు మధ్య టవర్ల నిర్మాణం

యాడికి, జూలై 21(ఆంధ్రజ్యోతి): వివాదానికి కారణమైన ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణ పనులను సోమవారం పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. అనంతపురం, కర్నూలు ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణ పనులను ప్రభాకర్‌రెడ్డి అనుచరులు దాదాపు 40 మంది ఈనెల 16న అడ్డుకోవడానికి యత్నించారు. దీనిపై పవర్‌గ్రిడ్ సంస్థ వారు ఫిర్యాదు చేయడంతో ఆ 40 మందిపై యాడికి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం స్పెషల్‌పార్టీ, స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య ట్రాన్స్‌మిషన్ టవర్ నిర్మాణ పనులు చేపట్టారు.

సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వరా?

మండల సమావేశంలో అధికారుల నిలదీత

యాడికి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల నిర్వహణపై సర్పంచులకు అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని తూట్రాళ్లపల్లి సర్పంచు సంజీవరాయుడు ఉపాధిహామి పథకం ఏపీఓ మద్దిలేటిని నిలదీశారు. సోమవారం ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన మండల సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. తమకు మూడేళ్లుగా వేతనాలు లేవని, వేతనాల మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు కోరారు. భూముల రీసర్వే తర్వాత వచ్చిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆర్‌ఐ కిష్టప్పను సభ్యులు కోరారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ చెన్నప్ప, ఎంపీడీఓ వీరరాజు, పలువురు అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల ఏర్పాటు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

బొమ్మనహాళ్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ గ్రామ సమీపంలో సుమారు 50 రోజుల క్రితం వీచిన గాలీవానకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. వాటికి మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన విద్యుత్ ఏఈఈ లక్ష్మీరెడ్డి తన సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

టీడీపీ కౌన్సిలర్‌పై దాడికి యత్నం

తాడిపత్రి, జూలై 21(ఆంధ్రజ్యోతి): తనపై వైసీపీ కార్యకర్తలు దాడికి యత్నించారని స్థానిక భగత్‌సింగ్‌నగర్ వాసి, 30వ వార్డు కౌన్సిలర్, టీడీపీ నేత మల్లికార్జున పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చి తనను అడ్డగించారని, పెద్దారెడ్డి గురించి మాట్లాడితే అంతు చూస్తామని బెదిరించారని, తనపై దాడికి ప్రయత్నించగా తాను ఇంటిలోకి పారిపోయానని ఆ ఫిర్యాదు పేర్కొన్నాడు. విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మరో 10 మంది అరెస్టు

బొమ్మనహాళ్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలాపురంలో ఈ నెల ఏడో తేదీన జరిగిన దాడి - ప్రతిదాడి కేసులో కొళగానహళ్లి గ్రామానికి చెందిన మరో 10 మందిని సోమవారం అరెస్టు చేసిన బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. గ్రామ శివారులో ఉన్న వీరిన అరెస్టు చేసి రాయదుర్గం కోర్టులో హాజరు వరుస్తున్నట్లు తెలిపారు. మైలాపురం, కొళగానహళ్లి గ్రామాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతున్నట్లు చెప్పారు.

అదుపులో అనుమానితుడు

గుత్తి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో తాను పార్క్ చేసిన టీవీఎస్ స్పోర్ట్స్ బైక్ తాళాలు పోయాయంటూ ఓ మెకానిక్ సాయంతో తాళం తీయించడానికి కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన రమేష్ సోమవారం యత్నించాడు. అనుమానం వచ్చిన మెకానిక్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రస్తా విషయంలో ఘర్షణ

గుత్తి,జూలై 21(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లో దుర్గాభవాని, లాల్‌రెడ్డి వర్గాలు ఓ రస్తా విషయంలో సోమవారం ఘర్షణ పడ్డాయి. పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇందులో వెంకటలక్ష్మి, దుర్గాభవాని, రాజు గాయపడ్డారు. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కళాశాల పరిశీలన



మెమెంటో అందజేస్తున్న సంగీత దర్శకుడు ఖుద్దూస్

ఉరవకొండ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్‌ఏ ఖుద్దూస్ స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సోమవారం సందర్శించారు. తాను సంగీత దర్శకత్వం వహించిన పీడి, మిస్టర్ గిరీశం, పద్మానండి ప్రేమలో మరి చిత్రాల్లోని పాటలను ఆలపించారు. పేద, ప్రతిభావంత విద్యార్థులకు తనవంతుగా ఆర్థిక సాయం, మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాషావలి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాడు నేరాలు చేసి.. నేడు మొసలి కన్నీరా..!

వైసీపీపై కూటమి నాయకుల ధ్వజం



ఆందోళన నిర్వహిస్తున్న కూటమి నాయకులు

గుంతకల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్నన్నాళ్లూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేశారు. తప్పుడు కేసులు పెట్టారు. మద్యం కుంభకోణంలో రూ. వేల కోట్ల దోచుకున్నారు. ఇప్పుడు చేసిన నేరాలకు కేసులు చుట్టుకుంటుంటే మొసలి కన్నీరు కారుస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని తప్పుపట్టే యత్నం చేస్తున్నారు.' అని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన వారు మాట్లాడారు. మద్యం కుంభకోణంలో తన బాస్‌కు రూ. కోట్లు దోచిపెట్టిన మిథున్‌రెడ్డి అరెస్టుకావడంపై స్థానిక వైసీపీ నాయకులు రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన జరుగుతోందంటూ గుండెలు బాదుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే సురేశ్, నంది, కేఎల్ సీన, షంషుద్దీన్ పాల్గొన్నారు.

వేతనం కోసం నిరసన

విడపనకల్లు, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాను విధుల్లో ఉన్నా 16 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా స్థానిక ఏఈ సత్యం వేధిస్తున్నాడని గడేకల్లుకు చెందిన పోల్ టూ పోల్ మన్ మహబూబ్‌బాషా గడేకల్లు విద్యుత్ కార్యాలయం ముందు సోమవారం నిరసన చేపట్టారు. తాను గత ఎన్నికల ప్రచారంలో పాల్గొనకున్నా.. అనవసరంగా విధుల నుంచి తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటే రూ. 1.50 లక్షలు డిమాండ్ చేస్తున్నాడని ఆరోపించారు. తన సమస్యను ఎస్ఈ శేషాద్రి శేఖర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. దీనిపై విడపనకల్లు ఏఈ సత్యంను వివరణ కోరగా.. మహబూబ్ బాషాను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు నాటి ఎన్నికల అధికారులు ఫోన్‌లో చెప్పిన మాటలే కానీ అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు తనకు అందలేదని తెలిపారు. తన దగ్గర సస్పెండ్ ఆర్డర్ కాపీలు లేవన్నారు. తాను అతన్ని డబ్బులు అడగలేదని, అతను విధులకు రాకపోవడంతో వేతనాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

తహసీల్దార్‌ను నియమించండి



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పుట్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలానికి తహసీల్దార్‌ను నియమించాలని అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్వో మలోలకు మండల రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఆ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. సుమారు రెండు నెలలుగా తహసీల్దార్‌ను నియమించలేదని, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల బ్యాంక్ రెన్యువల్, భూ సమస్యలు, విద్యార్థులు కుల, ఆదాయ ధృవపత్రాల అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నాలుగేళ్లుగా రహస్య అజెండాలతో కౌన్సిల్ సమావేశాలు

మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం, జూలై 21(ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లల్లో నాలుగు గోడల మధ్య అజెండలను రహస్యంగా ఉంచి .. ఏకపక్షంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2024 ఆగస్టు 26న ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా తాను బాధ్యతలు చేపట్టానని, అప్పటి నుంచి మున్సిపాలిటీ అభివృద్ధికి శాయిశక్తులా కృషి చేస్తున్నానని అన్నారు. గత నాలుగేళ్లల్లో మున్సిపల్ చట్టంలోని నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అజెండాను బహిరంగ పరచకుండా.. రహస్యంగా ఉంచి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారన్నారు. మరళా అదేవిధంగా సమావేశాలు చేపట్టాలని చెప్పడంతో పూర్తిగా తాను వ్యతిరేకించానని, ఆ వ్యతిరేకించిన అంశాలనే మీటింగ్ క్లర్క్ ద్వారా మున్సిపల్ ఛైర్మన్‌కు తెలియచేశామని అన్నారు. ఆ తర్వాత కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని పలుసార్లు నోటీసులు పంపించినా వెనక్కి వచ్చాయన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన రెండు వాయిస్ మెసేజ్‌లను సోషల్ మీడియాలో పూర్తిగా కాకుండా.. కొంచెం మాత్రమే పెట్టి.. తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. పూర్తిగా మాట్లాడిన వాయిస్ మెసేజ్‌లను ప్రచారం చేసి ఉంటే ఏదీ వాస్తవం, ఏదీ అవాస్తవం అనేది ప్రజలకు తెలిసే అవకాశం ఉండేదన్నారు. కొంచెం మాత్రమే మెసేజ్‌లు పెట్టి.. వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

బెళుగుప్ప, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. కళ్యాణదుర్గానికి చెందిన సంగప్పకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి కారులో అనంతపురం వెళుతుండగా కాలువపల్లి సమీపంలో లారీని కోళ్లను తరలిస్తున్న ఓ వ్యాన్ ఢీకొంది. వెనుక వస్తున్న వీరు కారు అప్పటికే ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. వాహనంతో ఉన్న వారు రాజేష్, మల్లక్క, జానకి, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. మల్లక్క పరిస్థితి విషమంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.



ఖాళీగా ఉన్న వైసీపీ కౌన్సిలర్ల కుర్చీలు

సమావేశానికి వైసీపీ కౌన్సిలర్ల డుమ్మా

కళ్యాణదుర్గం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అనుకున్నట్లే పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్‌కుమార్ సహా వైసీపీ కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు. దీంతో మున్సిపల్ వైఎస్ ఛైర్మన్ తిమ్మప్ప అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని 39 పనులకు 2.61 కోట్ల టెండర్ పనులకు, 31 పనులకు రూ.3 కోట్లు పరిపాలన ఆమోదం, 15వ ఆర్థిక సంఘం కింద రూ.1.95 కోట్లతో నాలుగు పనులకు ఆమోదం లభించింది.

యాడికిలో వర్షం

యాడికి, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి 31 మి.మీ. వర్షం పడినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి మహ బూబ్‌బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలిస్తే ఆదివారం మండ లంలోనే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం కురిసిన వర్షం వల్ల కొర్ర, కంది తదితర పంటలు సాగుకు అనుకూలమన్నారు.